శాపగ్రస్తమైన యిల్లు

(ఫ్రెంచికథకుడు బాల్‌జాక్ కథకు అనుకరణము)

మరుపూరు కోదండరామరెడ్డి గారు

సీతారామయ్య మాకు బాల్యమిత్రుడు. ఆయన పొడుగుగా, సన్నగా నుంటాడు; చామనచాయ. ఆయనముఖాన గడుసుదనము, తెలివితేటలు చెయిచెయి గలుపుకొని చిరునవ్వు చంద్రికలలో విహరించుచుందురు. నేటి తొలకరి కవులలో ఆయన ఒకడు. కొండ చరియల్లో గండశిలలచే నిరోధింపబడకుండా, సాంద్రారణ్యములలో నుండి వచ్చు గంభీరనినాదముతో శ్రుతి గలిపి నురుగులుగ్రక్కుచూ పాడుతూ శరవేగమున పోవు సెలయేటిప్రవాహానుగుణ్యమైనది ఆయన కవితాధార. ఆయనకు ఘోరమగు విషయమును వినడం అన్నా వర్ణించడంఅన్నా మహాసరదా.

ఒకనాటిసాయంత్రం కొందరు స్నేహితులము నెల్లూరు చెరువు చూడను పోయినాం. చెరువు తెప్పలుగా నిండిఉన్నది. నరసింహునికొండమీదనుంచి వచ్చు పిల్లతెమ్మెరల ప్రేరణచే చిన్నచిన్న అలలు ఆడుమావచ్చి కట్టకు తగిలి విరిగిపోవుచున్నవి. మేము అలలను తాకేటట్టు కాళ్లుపెట్టుకొని మెట్లమీద వరుసగా కూర్చొనున్నాం; చిలవలు గుంపులుగుంపులుగా గూడి ఊర్మికాడోలికల్లో నూగుచున్నవి. సూర్యుడు పడమట ఒకటిగాచేరి ఉండే మొగుళ్ళల్లో దూరినాడు; తరిపిఎండ దట్టంగాఉండే మేఘాలను భేదించుకొని వచ్చి ప్రకృతికి అంతా బంగరుపోత పోసినది. కొంతసేపు ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకొన్నాం. కొంతసేపటికి సీతారామయ్య తాను బయటకు తీసిన ఒక ఇంటిసంగతి చెప్తానన్నాడు.

'దయచేసి చెప్పండి' అన్నా.

సీతారామయ్యకు తనకష్టాలు ఫలించినందులకు సంతోషస్ఫులింగాలు కండ్లగుండా బయటకు వచ్చి ముఖానికి ఒక వింతకాంతిని గూర్చినవి. ఏదో కొంతసేపు యోచించి ఇట్లు చెప్ప మొదలుపెట్టినాడు:—

"స్వర్ణముఖి పశ్చిమతీరమున కాళహస్తికి చాయగా ఒకపాతపెద్దయిల్లున్నది; చుట్టుపట్లా ఎంతమారము చూచినా ఒక్క గుడిసైనా కాన్పించదు. ఇంటివెనుక ఏటి అంచువరకు ఒకతోట ఉన్నది. దారులప్రక్కన వేసిన చెట్లు చాలకాలమునుండి కత్తిరించకపోవుటచేత పొదల్లాగ పెరిగిపోయినవి; రెల్లు ఏటంచున చాలా ఉన్నతంగా పెరిగి వెలుగుగా ఏర్పడిఉన్నది. ఏటికట్టమీద అడవిపువ్వులు దట్టంగా పూచి ఒకవిధమైన రమ్యతనే కూర్చినవిగాని అవి శిథిలదేవతను ఆరాధించిన పూజాపుష్పాలే అయినవి. మామిడి మొదలైనచెట్లు కొన్నిఏండ్లనుండి సంస్కారంలేక గొడ్డుబోయినవి. వాలుకాయుతమైన దారులలో గడ్డి మొలచి చిహ్నలే మాసిపోయినవి. అచటకు పోయిన హృదయానికి కలిగే సంతాపానికి, అవ్యక్తానందానికి దోహదమిచ్చే దానికి ఒకపుట్టలో పగిలిపోయినగడియలను లెక్కించిపాతగిన్నెలు పడియున్నవి.

మిద్దెకప్పు చాలావరకు కూలిపోయి ఉన్నది. మూలల్లో గుడ్లగూబలు, పయిడిగింటలు, కీమరాలు గూళ్లు పెట్టిఉన్నవి. గోడల్లో పెద్దపెద్ద పగుళ్లున్నవి. వాటిలో గడ్డి, చెట్లు పెరిగిఉన్నవి. కిటికీలు తలుపులు అన్నీ మూసి ఉన్నవి. గడియలు బందులు త్రుప్పుపట్టి ఎఱ్ఱగా నున్నవి. తలుపులు ఎండకు ఎండి, వానకు తడిసి ఇడిసి పోయినవి. ఇంటికి వేసిన రంగంతా పోయి, పాచిపట్టి నల్లగాపోయినది. అక్కడ అంధకారము, నిశ్శబ్దము నిర్నిరోధంగా అధికారము చలాయిస్తున్నవి. పక్షులు పిల్లులు, ఎలుకలు, ఉడుతలు నక్కబావను రాజుగా చేసుకొని, అంతఃకలహాలు పెట్టుకొంటూ, రాజీలు కుదుర్చుకొంటూ రాజ్యాంగం నడిపిస్తున్నవి. బలవంతులు బలహీనులను బాధించడం అక్కడకూడా కద్దు. ఆ ప్రదేశంలో ఎచ్చటకుపోయినా 'దీనిగూర్చినదంతయు నొక్క అగాధమగు సమస్య' అని అస్ఫుటాక్షరములతో వ్రాసి కండ్లఎమట కట్టినట్లు స్ఫురించుచున్నది.

ఇంటి ముందుభాగమున సగంవిరిగిన ఒక కమాను గల సింహద్వారము గలదు. ఇక్కడగూడ వెనుకతోటను బోలి సంకులపరిస్థితులే గోచరిస్తున్నవి. అక్కడక్కడ నాటియుండే రాళ్లచుట్టూ గడ్డి, నాగజెముడు అలుముకొన్నది. అడుగుపెట్టరాకుండా పల్లేరు పరచుకొనిపోయియున్నది. ఇంటిముందు ఒకజలమాత్రం విరిగి పడియున్నది. దాంట్లో నాగజెముడు అడవైపోయియున్నది. దానిచుట్టూ అరుగులు పగిలి ఉప్పరిసి కొద్దిగాలితాకుడుకే పడేటట్లున్నవి. ఇంటిలోకి పోవు మెట్లరాళ్లన్నీ వదలి చిల్లుపోల్లుగా పడిఉన్నవి. నేల చాలావరకు చెమ్మగిలి చితచితలాడుచున్నది. కప్పల 'గరరపరట్ కురరవరరగట్'లును, కర్దమసంబంధములైన కీటకారావములును అంతరాయములేకుండా వినబడుచున్నవి.

దైవనిర్దిష్టుండై ఆశ్రయానుడు ఈ నివాసము గుండె నడచెనా? ఎవడైన యీ ఆరామమును ఉప్పుమడికమ్మని శాసించెనా?—ఇచట ఎవడైన మాతృభూమికి విద్రోహ మొనర్చెనా?—దైవమానణ మొనర్చెనా?... ఇవీ అక్కడతోచెడు ప్రశ్నలు. దీనికి క్రిమికీటకాదులు మాత్రం అతిదీనంగా అరచునేకాని ప్రత్యుత్తరంమాత్రం యిచ్చుటలేదు. ఈ నిర్జనప్రదేశం అంతు ఎవరికీ తెలిసినదికాదు. ఇది ఎవరిదో ఒకసంపన్నుని ఆవాసముగా తోస్తున్నది. ఇంటిముందు ఏదో ఏదో పెద్ద అక్షరములతో వ్రాసినట్లున్నది; కాని అవి పాచిపట్టి చెరిగిపోయియున్నవి. అతికష్టంమీద 'లక్ష్మీనిలయం' అని చదివినాను.

కాళహస్తిలో రాజవస్యనార్థమై యుండిన కాలంలో యీవిచిత్రమైనయిల్లు నాకొక సంతోషావహమైన విషయమైనది. ఇది శిథిలముకంటె వేరైనది. శిథిలోన్ముఖమైనదానికి కొంతపూర్వచరిత్ర గలదు. అయితే యీగృహము నిలిచియుండియు, ప్రతీకారంగా నాశనమే నిర్ణీతమైనట్లు క్రమముగ శిథిలమగుచు దాని గర్భములో ఒకరహస్యమును— అగోచరమైన విషయాన్ని —యిముడ్చుకొనియున్నది. అచట దానిఉనికియే ఒకవిశేషానికి సంజ్ఞగా తోస్తున్నది. చాలామారులు ధైర్యంగా ఆ ప్రదేశమునకు వెళ్లి, చీల్చేముళ్లను త్రొక్కుకొంటూ, యజమానుడు లేనట్టి ఆకోటలో నడిచితిని. శిథిలదేవతచేత క్రమ్మభంగముచేయబడిన ఆచోటును చాలసేపు చూస్తూనిలబడేవాడిని. అది ఎందులకో చాలకాలంవరకూ దీనివిషయమై ఎవరిని అడిగినవాడినికాను. అప్పుడప్పుడు కొన్ని గీతాలుకూడ

వ్రాసినాను. దుఃఖయుతములైన కొన్ని తలంపులకు లొంగక తప్పినదికాదు. ఈ నిర్జనతకు అప్పుడే నాకు కారణము తెలిసియుండిన నేవ్రాసిన పద్యాలఘాటు చెడియుండేది. ఆ ఆవాసమంతా దురదృష్టజలదావృతమైనమానవజీవితదృశ్యంగా తోచినది. శవాలులేని శ్మశానప్రకృతి స్ఫురించినది. నాకచట ఆనందాశ్రువులను అణచి దుఃఖాశ్రువులే కురిసేవి.

ఒకనాటిసాయంత్రం ఒక కష్టాంతనాటకమును పూర్తిచేస్తూ 'లక్ష్మీనిలయానికి' వెళ్లినా; నాటకాన్ని గురించి యోచిస్తూ పుట్టలలో నడుస్తున్నాను. ఒకపిట్ట బుఱ్ఱున పైనపోయింది. భయకంపితహృదయముతో రాపడినిలుచున్నాను. మంచునరిపెము నిలువెల్లకప్పినట్లైనది; ఇంతలో గాలి ఎండుటాకులను కదిలించినది. అది ఆగృహాంగణ ప్రదేశమునుండి వచ్చిన విలాపంవలె వినబడ్డది. మరీ గడగడ వణకినాను.

మనస్సంతా అంధకారంతో నిండిపోయింది. అట్లే సత్రానికివచ్చినాను. భోజనంచేసి నాగదిలో చాపమీద తలక్రింద చేయిబెట్టుకొని పరుండి యోచనలో మునిగిపోయియున్నాను. ఒక్కతలంపైన గట్టెక్కలేదు. గోడమీద వెలుతురులో పురుగులను తింటున్న బల్లినిమాత్రం గమనిస్తూ పరధ్యానంలో ఉన్నాను. సత్రం ఆమె త్వరగా తలుపుసెట్టుకొని లోనప్రవేశించి ఆతురతతో 'అయ్యా! అయ్యా! రామనాథంగారు వచ్చి ఉన్నా' రన్నది.

'రామనాథంగా రెవరు?'

'ఏమిటీ.........మీకు రామనాథంగారు తెలియదా?ఓ! ఇదిచాలాచిత్రం' అంటూ బయటికిపోయినది.

అప్పుడే సన్నటి, పొడుగాటి మనిషి నా ఎదుట నిలబడ్డాడు. ఆయన డీకొనబోయ్యే పోట్టేలులాగ లోపలికి వచ్చినాడు; తల కొంచెం చిన్నదిగాఉన్నది; నొసలు విశాలంగా ఉన్నది. ముఖం వెడల్పుగా చప్పిడిముక్కుతో విరాజిల్లుచున్నది. ఆయన నాకు చాలాకొత్తగా ఉన్నాడు. ఒకనల్లకోటు వేసుకునున్నాడు; అది భుజములమీద, చంకల్లో చినిగిపోయియున్నది. కాని మెడలో ఒక అమూల్యమణి దీపపువెలుతురున కాంతిపుంజాలను ప్రవహింప జేస్తున్నది. చెవులలో తెల్లరాళ్ల అంటు జోళ్లున్నవి.

'ఏమహాశయునితోడి సంభాషణభాగ్యము నాకు లభింపనున్నదో నేతెలుసుకొనవచ్చునా?' అన్నాను.

వెంటనే ఆయన నేనున్న చాపమీద ఎదురుగా కూర్చున్నాడు. అరచేతులను రుద్దుకొంటూ 'అబ్బా! ఎంతచలండి...అయ్యా, నేను రామనాథంగారిని' అన్నాడు.

'మంచిదిచూస్తాం' అని మనస్సులో అనుకొంటూ వినమ్రుడనైనాను.

'నేను కాళహస్తిలో ఒకన్యాయవాదిని'

'చాలా సంతోషం'

'ఒక్కనిమిషం' అంటూ నిశ్శబ్దంగా ఉండుమని ఆజ్ఞాపించేమాదిరి చేతులెత్తి 'మన్నించండి మీరు లక్ష్మీనిలయానికి తరుచుగా వెళ్లుచున్నట్లు నాకు తెలియవచ్చింది' అన్నాడు.

'అవునండీ'

'ఒక్కనిమిషం' తలాడించుచూ 'ఇదే తగినచర్య తీసుకొనవలసిన ప్రమాదం. అయ్యా, కీర్తిశేషురాలైన సుశీల మరణశాసనము ననుసరించి—వీలు హక్కుదారుని బాధ్యతతో—ఇక తమరచటకు పోకూడదని విన్నవించుటకు వచ్చియున్నా, ఒక్కనిమిషం... నేనేమి పోలీసువాడిని కాదులేండి. దీనిని అపరాధంక్రింద కట్టాలని నాకిష్టములేదుకాని కాళహస్తిలోకల్లా అందమైన భవనాన్ని నాచేత పాడుపెట్టించినకారణాలు మీకు తెలియకపోవచ్చును; అయినా మీరు విద్యాధికులుగా కనబడతారు. అడ్డగించిన ప్రదేశంలోనికి ప్రవేశించుటను చట్టములు కఠినశిక్షలు విధిస్తూ నిషేధించుచున్నవని మీరు తెలుసుకోవలెను. పుట్టలే గోడతో సమానంకదా! అయినా ఆయింటి ఇప్పటిస్థితి మీజిజ్ఞాసకు కారణమై ఉండేవచ్చును. ఇంటిని తమయిష్టానుసారంగా చూడమనేదానికంటె నాకువేరేసంతోషదాయకమైనవిషయంలేదు... కాని...వీలువ్రాసిన ఆమెవాంఛితార్థములనునెరవేర్చవలసిన బాధ్యత నాకు గలదు; కాబట్టి ఇక మీరు ఆతోటలో ప్రవేశింపకూడదని ప్రార్థిస్తున్నా. ఒక్కనిమిషం— అయ్యా, వీలు చదివినదిమొదలు నేనుగూడా దాని

దగ్గరకుపోలేదు. ప్రతిసంవత్సరం ఆమెనిర్ణయించిన ధనము నుండి పన్నుమాత్రం కట్టుచున్నా. ఒక్కనిమిషం...ఓ! సుశీలగారి మరణశాసనం కాళహస్తిలో చాల గందరగోళం చేసింది.'

ఇక్కడ ఆయన చీదుటకు నిలిపినాడు. ఈవిషయమే తన జీవితంలో గొప్పకార్యమైనట్లు తనకీర్తి, తన ప్రతిభ సర్వస్వమైనట్లు ఆయనమాటలవలన నాకర్థమైనది. అయినా వాస్తవాన్ని అధికారముతో తెలుసుకుందామనే సంతృప్తికి వ్యతిరేకుడను కాలేను.

'అయ్యా, యీ విశేషమునకు కారణం అడుగుట నింద్యముకాదనుకొంటా' అన్నాను.

ఈమాటలతోగూడా ఒకమనిషికి ప్రియతమమైన విషయాన్ని అనుసరించే సర్వానందాలను సూచించు ఒక చూపును ప్రసరింపజేసినాడు. చాలా ఆత్మసంతృప్తితో కోటుచేతులు పైకిలాగుకొని, పొడిడబ్బి బయటకు దీసి; తెరచి నాకయ్యబోయినాడు. నేను వద్దనగా ఒక్కపెద్ద చిటిక తాను తీసికొని పరవశత్వమును పొందినాడు. ఎవడేని యిచ్ఛాపూర్తి ఆనందము ననుభవింపక మరియొకనికి కలుగు ఆనందాన్ని తెలిసికోలేడు.

రామనాథమునకు పొడిపిచ్చి. పంచఅంచుతో ముక్కుతుడుచుకొంటూ, పొడిఘాటు శబ్దాన్ని తగ్గించగా అర్ధనిమీలితనేత్రుడై మునిముక్కుతో యిట్లు చెప్పదొడగినాడు:—

'నేను మొదట చెన్నపట్నంలో ఆర్‌బత్‌నాట్‌లో గుమస్తాగావుండినాను. చాలామంచినౌకరి లేండి. బహుశా దానినిగురించి చెప్పగా విని ఉంటారు. ...లేదుగా'బోలు; అది దివాలాతీసింది. ఆసంగతి లోకవిదితం అయింది. చెన్నపట్నంలో తగిన వరుమానం లేకపోవుటచేతను అప్పుడు వకీళ్ల అదృష్టం చూచి యిక్కడకు వచ్చి న్యాయవాదిగా చేరినాను. ఇక్కడ ఒక శ్రీమంతుడు తనకూతురుతోగూడా తన ఆస్తినంతా నా కిచ్చినాడు. ఒక్కనిమిషం!.'

అంటూ కాసేపునిలిపి మరల మొదలుపెట్టినాడు.

'ఇక్కడకువచ్చి నేను న్యాయవాదిగా చేరిన మూడునెలలకు,ఒకరాత్రి నేనుపండుకొనబోవునపుడు—ఇది జరిగినదినా పెండ్లికిముందు—సుశీల తనదాసి వెంకటలక్ష్మిచే నన్ను పిలువనంపినది. అది యిప్పుడు యీ సత్రంలోనే పనిజేయుచున్నది...ఒక్కనిమిషం. చెప్పడానికి మరచినాను—సుశీల భర్త మధుసూదనుడు చెన్నపట్నంపోయి అక్కడ, నేనింక రెండునెలలకు యిక్కడకు వస్తాననగా చనిపోయినాడు — ప్రతివిషయంలో అతిగా ప్రవర్తించి అతి నికృష్టపుచావు చచ్చినాడట పాపం. తెలిసిందా? మధుసూదనుడు వెళ్లిననాడే సుశీల లక్ష్మీనిలయాన్ని పాడుబెట్టి కాళహస్తి బహదూరుపేట తోటలో ఒక మిద్దెయందు చేరినది. కొందరు సామానునంతను కష్టంగా సదరు సుశీల స్వాధీనంలో ఉండే ప్రదేశాన్ని, సదరు లక్ష్మీనిలయాన్ని సాధారణంగా అలంకరిస్తున్న యావత్తు సామానులను తగలబెట్టించెనంటారు.—ఓ! ఇదేంది! మన్నించండి వీలు వ్రాస్తున్నాననుకొన్నాను.—అవును. వెనుక తోటలో దహనం చేసిందంటారు. లక్ష్మీనిలయాన్ని వదలింది మొదలు ఆమె ఎవరికినీ కనబడేదికాదు; కొన్నిరోజుల్ల తరువాత ఇంటికిపోయినవారికిగూడ కనబడేది కాదు. మనిషి చాలామారింది.

'ఒక్క నిమిషం...ఆమె చాలామంచిది. ఆమె యీహారం నా కిచ్చినది.' అంటూ మెడలో వజ్రాన్ని చూపినాడు.

'ఆమెకు చాలా జబ్బు చేసింది. బ్రతుకు కాశే వదలుకొన్నది. ఒక్కవైద్యుని గూడ పిలువలేదు. ఇక్కడ ఆడవాళ్లంతా సుశీల మనస్సు బాగలేదే అంటారు.వాళ్లు సుశీల నాసహాయ మపేక్షించిందనగానే నాకాశ్చర్యమైంది.

'నేను పోయినది నిశీథంలో అయినా ఎట్లో వూరంతా తెలిసింది. దారిలో దాసిని కొన్నిసంగతులు అడిగినా, జబాబు చాలా అయోమయంగా ఉండినది; కాని ఆమెకుఆరాత్రిగూడా గడవడం దుష్కరంఅనిచెప్పించి. పన్నెండు గంటలకు సుశీలయిల్లు చేరినాం. పెద్దపెద్దవి గాఢాంధకారబంధురంగా ఉండే గదులు దాటినాము. నేల చెమ్మగా భూతపిశాచాలకు నివాసయోగ్యంగా ఉండినది. శిథిలదేవతయొక్క తొలివలపు చూపులు ఆ సౌధముమీదగూడ ప్రసరించుచుండేఉన్నది. కడకు సుశీల ఉండే గది చేరినాము. అది మిద్దెమీద ఉండినది. ఆమె పండుకొని యుండే పరుపుమీద ఆమె ఎచ్చట

నున్నదో కనుగొనేదానికి చాలా కష్టపడ్డాను. ఇంట్లో లాంతరు వెలుగుచున్నా గది పెద్దదగుటచేత వెలుతురు చాలిందికాదు. ఇల్లంతా దుమ్ము నిండిఉన్నది. అందు వలన గదిలోనికి పోగానే తుమ్ములు దగ్గుతో కలిసివస్తు న్నవి. ఆమెప్రక్కన ఒక బల్లమీద ఒక బంగారు ఉంగ రము ఉన్నది. తరువాత దాన్ని నాభార్యకు యిచ్చి నానులెండి.

'ఆమెముఖం పాలిపోయినది; వెంద్రుకలుమాత్రం చీకట్లను ఈనుచున్నవి. ఈజిప్టుకళవాళ్లాగ (మమ్మీలు) పెద్దదిండ్లకు ఆనుకొని పండుకొనియున్నది; ఆమెకండ్లు జ్వరముచే కాంతిహీనములై నిర్జీవములైనట్లు ఎముకల్లో కదులుటలేదు; ముఖాన స్వేదం బిందువులు కట్టిఉన్నది. చేతులలో మాంసములేదు; ఎముకలను కోమలమైన చర్మం తో కప్పినట్లున్నది; నరాలు స్ఫుటంగా కనబడుచున్నవి. నిజంగా ఆమెస్థితి చాలా భయోత్పాదకంగా ఉండినది; వ్యాధి ఆమెమీద చాలాఘోరంగా దోపిడీలుచేసింది. పెదవులు తెల్లబారి ఉన్నవి. మాట్లాడేటప్పుడు కూడా చలించనట్లున్నవి. నావృత్తిచేత యిట్లు చావసిద్ధముగనున్న వారి యిండ్లకు ఏడ్పులనడుమ మరణశాసనాలు వ్రాయను పోయియుండినా, నిర్జనంగా పాడుపడినట్లు ఉండే యీ విశాలమందిరములో ఒకమూల నిశ్శబ్దంగా ఉండే యీమనిషిని చూడగానే మనస్సు నూతనపరిస్థితులకు ఆకరమైంది. ఎట్టి స్వల్పమైన అలుకుడుగూడా వినిపించుట లేదు. ఉచ్ఛ్వాసనిశ్వాసములుగూడ జరుగునట్లు తోచలేదు. నేను తదేకధ్యానములో ఆమెను చూస్తూ రాయిమాదిరి నిలబడ్డాను...ఇప్పుడూ నే నక్కడ ఉన్నట్లే తోస్తున్నది.

కడకు ఆమె కండ్లుదలించినవి. కుడిచేయి ఎత్త వలెనని ప్రయత్నించినది, కాని, తత్క్షణమే పరుపు మీద పడిపోయింది. 'నేను చాలా ఆతురతతో మీకోసం కనిపెట్టుకొని ఉన్నా' అన్నది. ఇది ఒక నిట్టూర్పులాగు వెల్వడినది. అది కంఠధ్వనియే కాదు. ముఖం వుబ్బినట్లుండినది. మాట్లాడేదానికి సర్వ ప్రయత్నములు చేసింది.

'అమ్మా' అన్నాన్నే.

సుశీల నన్ను మాట్లాడవద్దని సంజ్ఞ చేసింది. ఇంతలో వెంకటలక్ష్మి వచ్చి 'మాట్లాడవద్దు. ఏమాత్రం శబ్దాన్నిగూడ వినసహించదు' అని నాచెవిలో గుస గుసలాడింది.

నేను కూర్చున్నాను. కొన్ని ముహూర్తాల తరువాత ఆమెశక్తినంతా ఆయత్తంచేసుకొని కుడిచేయి కదలించినది. చాలాకష్టంమీద దిండుక్రిందకు పోనిచ్చి నది; కానేపుకదలకుండా ఉండింది. తుదిప్రయత్నంచేసి చెయిబయిటకులాగింది. దానితోగూడా ఒక లకోటా చేసిన కాగితం బయటికి వచ్చింది. ఇది చేయగానే చెమటబోట్లు కొన్ని నొసటనుండి రాలి దిండుమీద పడ్డవి......'ఇది నామరణశాసనం. దీనిని మీకొప్ప జెప్పుచున్నాను' అన్నది.

'హా! తండ్రీ.' అంతే—బల్లమీద ఉంగరం లాక్కొన్నది. త్వరగా పెదవులదగ్గరకు తీసికొనిపోయి ముద్దు బెట్టుకొన్నది......ప్రాణాలువాసింది.......

ఆమె చంచలరాహిత్యమైన కన్నులు తలచు కొంటె నాకు యిప్పటికీ భయం—ఆమె చాలా ఘోరంగా బాధపడియుండవలెను. ఆమె తుదివీక్షణం సంతోషార్ద్రంగా ఉండింది. చనిపోయినా ఆసం తోషం ఆమెముఖంమీద నిలిచియుండినది.

ఇంటికివచ్చి కాగితం విప్పిచూచినా. సుశీల తన మరణశాసనానికి కర్తగా నన్నే నియమించినది. ఆస్తి నంతా కొండమీద సంస్కృతపాఠశాలకు వ్రాసింది. లక్ష్మీనిలయాన్ని గురించియీవిధముగానున్నది:—'దీనిని యాభైఏండ్లు వదిలిపెట్టవలసినట్లు—ఆమె గతించినరోజు మొదలు, మరణసమయంలో ఎట్టిస్థితిలో ఉండెనో అట్టి స్థితిలోనే—ఎవరుగూడా దానిలో ప్రవేశించుటకుగాని ఎట్టిమరమ్మతులు చేయుటకుగాని గట్టిగానిషేధించింది. అవసరమైనచో మనిషిని కాపుంచవలసివచ్చిన,అట్టికర్చుకు గూడ కొంతధనం నిర్ణయించినది. గడువుతీరిన తరు వంతరం, శాసనంవ్రాసిన ఆమెకోర్కెలు నెరవేర్చబడి నచో ఇల్లు నావంశానికి జెందవలసినట్లును; తద్భిన్నమై నట్లయిన యీ మరణశాసనానికి అనుబంధంగాఉండే మరియొకదానిలోన్వ్రాత నెరవేర్చిన తనవారసులకో చెందవలసినట్లును వ్రాసిఉన్నది. అందువల్ల......' అంటూ వాక్యం పూర్తిగాకమునుపే నిలిపివేసాడు. అమిత సంతోషంతో తేలిపోతున్నాడు. గర్వోన్మేషంతో

నన్ను చూడడం మొదలుపెట్టినాడు. ఆయన గౌరవాధిక్యాలను కొంచెంశ్లాఘించి చాలా తృప్తికలుగజేసినాను. చివరకు 'మీమాటలవలన, పాలిపోయి, అస్థిపంజరమై చావ సిద్ధముగనుండిన ఆమె నాకట్టెదుట కనబడుచున్నది. అయితే యీ అసాధారణమైన మరణశాసనంలోని విషయాలనుగురించి మీఉద్దేశమేమో' అని ముగించినాను.

'వజ్రంచేత నన్ను బహూకరించిన ఆమెగుణగణాలను నిర్ణయించడానికి నేనుప్రయత్నించను' అని నవ్వినాడు. ఎట్లో కష్టసాధ్యంమీద కాళహస్తిలో ఆబాలగోపాలం యీవిషయాన్నిగురించి అనుకొన్నవి చెప్పించుకొన్నాను. అవి చాలామట్టుకు పరస్పరభిన్నంగాను, కేవలం తలదీకనకాయగా నుండుటచేత నాకు దీనివిషయమై ఎంత ఆసక్తిఉండినా మాటలమధ్య నిద్రమత్తుచేభారంగా ఉండే కనురెప్పలు కలుసుకొని పోవుచున్నవి. కడకు రామనాథం లేచి 'దీనినిగురించి తగజాగ్రత్తవహించండి' అంటూవెళ్లినారు.

అప్పుడే నేనులేచి తలుపు ఓరవాకిలిగావేసి, సోఫాకుర్చీలోకూర్చుని పరిపరివిధములుగా యోచిస్తున్నా. కొంతసేపటికి ఎవరోతలుపునెట్టినారు...... పత్రంఆమె లోపలికివచ్చి త్వరగా 'రామనాథంగారు లక్ష్మీనిలయంవిషయమై పాతపాటే పాడినా డనుకొంటాను' అని ఇంకా హెచ్చిన ఆతురతతో 'ఏమిటి మీకు చెప్పుతుండినది?' అన్నది.

సుశీల విచిత్రగాథను ముక్తసరిగా మూడుమాటల్లో చెప్పి 'అమ్మా, దీనివిషయం నీకు ఇంకా కొంత ఎక్కువతెలిసినట్లున్నది. లేకపోతే ఇప్పుడు ఇంత ఆతురతతో ఎందుకొస్తావు' అన్నాను.

'లేదు నీతోడు నాకుతెలియదు'

'వద్దు, ప్రమాణంచేయవద్దు—నాకుతెలుసును—రహస్యాన్ని గర్భస్థంజేసుకొని నీనేత్రాలు గురుత్వాన్ని పొందిఉన్నవి. నీకు మధుసూదనుని తెలుసును; దయచేసి చెప్పు, ఆయన ఎటువంటిమనిషో?'

'మధుసూదనుడు సరసుడు, చాలాపెద్దమనిషి కూడాను. ఆయన ఎప్పటిడబ్బుఅప్పు డిచ్చేవాడుకావటంచేత ఆయనతో మాకేమి తగాదా ఉండేదికాదు.... అయితే పాపం కొంచెం దుడుకుమనిషి. ఇక్కడ ఆడవాళ్ళంతా ఆయనను చాలాభూషించేవాళ్లు.'

'కొంచెం దుడుకు కావడంచేతనా?,

'ఉండవచ్చును. వాళ్లు అన్నట్లు ఆయనదగ్గర ఏమో ఉండవలె ఆయనను సుశీల వివాహము చేసుకొనేదానికి' అన్నది. ఈ మాటల్లో కొంచెం అసహిష్ణుభావం పొడచూపినది. మరల ఒక్కక్షణం అయినతరువాత మొదలుపెట్టినది. నాకు యితరులకు కష్టం కలిగించాలని లేదుగాని,...ఆమె కాళహస్తిలోకల్లా సౌందర్యఖని, సౌభాగ్యవంతురాలు. ఆమెకు సాలుకు ఇరవై వేలరూపాయలవరుమానం గలదు......ఊరంతా ఆమెపెండ్లిని చూడను పోయినారు; పెండ్లికొడుకు సహజసౌందర్యముతో అందరిని వశపరచుకొంటున్నాడు. నిజంగా ఆనధువుకు భూమణప్రాయుడు.'

'వాళ్లు చాలాసుఖంగా ఉండినారా?'

'ఏమిటి, సుశీల అద్వితీయమైన మహాయిల్లాలు. ఆమెమాటలు దయారసపరిపూరితములు. మధుసూదనుడు కొంచెం గడుసువాడైనా ఆయనంటే మాకు చాలా యిష్టం. వారిగుణలతలు పెనవేసుకొని అల్లిపోయినవి; అంత అనుకూలదాంపత్యం సీతారాములకుగూడ లేదనవలసిందే.'

'అయితే వారివియోగమునకు ఏదో అనివార్యమైన దురదృష్టం కారణభూతమై ఉండవలె' అన్నాను.

ఏదో యోచించినట్లు నటించి......

'వాళ్ల అదృష్టహీనాన్నిగురించి నే నెప్పుడు చెప్పలేదు. తెలిసిందా. మరీదానివిషయమై నాకేమి తెలియదు.' అన్నది. కాని చూపులుమాత్రం హృదయం కలతచెందినట్లు ప్రకటిస్తున్నవి.

'ఆ! మంచిది......,ఆవిషయమై నీకు నిజంగా తెలుసునని నాదృఢనమ్మకం'

ఈమాటలతోగూడ చేష్టలుదక్కి పటంలో బొమ్మలాగనిలబడ్డది. ఏమి యోచించుకొనుచున్నదోగాని ఊహాసముద్రముయొక్క అలలో చిక్కుకొన్నట్లు మాత్రం ముఖలక్షణాలు సూచిస్తున్నవి. చివరకు మాటలు ప్రారంభించినది:—

'మంచిది......నాకు తెలిసినవంతా చెప్పెద వినండి. రామనాథంగారు మిమ్ములను చూడవచ్చి

నప్పుడు లక్ష్మీనిలయసంబంధమైన సుశీల విషయం సమగ్రంగా చెప్పిఉంటాడనుకొన్నాను. మీరు గుణవంతులుగ తోచుట నాకు మీతో మాట్లాడవలెనని బుద్ధిపుట్టించింది .....ఎవరికీ ఎట్టి అపకారముచేయని నాబోటి నిర్భాగ్యురాలిని బయటబెట్ట రనుకొంటాను : ఇక్కడ వాళ్లకు దీనివిషయం ఒక్కమాటైన చెప్పేదానికి ధైర్యంచాలిందికాదు—వాళ్లంతా కరేపాకుకోసే ఎరుకలగుంపులేండి. వాళ్లనోరు త్రాగుబోతువాళ్లనోరు వంటిది. వాస్తవంలో నీమాదిరి యిన్నిరోజులు మా సత్రంలో ఉన్నవాళ్లులేరు. ఐదువేలరూపాయల...... ......కథను వినేదానికి అర్హులుగూడా నాకు కన్పించలేదు—.

'రంగమ్మా,' అంటు ఆమెమాటకు అడ్డంవచ్చి 'నీకు నమ్మకముంటే ఆభారం నామీదవేయుము...... యీలోకంలో మోయవలసిన బాధ్యత నామీద ఉంటుంది.' అన్నాను.

'దానికి నీవు భయపడవలసిన అవసరముండదులే' అని మహావేగంతో అన్నది. దీనివలన నాకొక్కడికే కాదు యీకథచెప్పినది అనుకొన్నాను. అయినా చెవియొగ్గినా.

'మదనపల్లినుండి వచ్చి ఒకధనవంతుడు మాసత్రంలోఉండేవాడు; రెండుమూడు సంవత్సరా లుండినాడు. పనేదో మాకు తెలిసిందికాదు. ఆయనపేరేదో యీశ్వరయ్య...అ...విశ్వేశ్వరయ్య. అదిలెక్కలపుస్తకంలో ఉన్నది. కావలిస్తే మీరు చూడవచ్చు. ఆయన చాలా అందగాడు — మదనపల్లిలో అందరూ కురూపులట. మంచిదృఢకాయుడు. ఆయనవి పొడుగాటి వెంట్రుకలు; పిడిగంటువేసుకొన్నప్పుడు ముద్దులుమూటగట్టుచుండేది. ఆయన మంచిమంచి పట్టువస్త్రాలు ధరించేవాడు. అటువంటివి నేనెక్కడా చూడలేదు. మననగరిలోగూడ లేవనవచ్చు......ఇంకా, భోజనప్రియుడుకాడు. వినమ్రుడు, మంచిమర్యాదస్థుడు కావడంచేత ఆయనంటే ఎవరికీ కోపంకలిగే అవకాశమ్మేలేదు.

ఆయన ప్రతిదినం దేవాలయానికి పోయ్యేవాడు. కొన్నిరోజులకు సుశీల గుడికిపొయ్యేవేళకే ఆయనా ఎప్పుడూ వెళ్లడం కనిపెట్టినాను. దేవళంలో ఎప్పుడు ఒకచోటనే కూర్చుండి జపంచేసుకొనేవాడు; దీనిని గురించి ఎవరికీ అనుమాన ముండేదికాదు, ఎందుకంటే దేవళంనుంచి తిరిగివచ్చిందాక తలయెత్తి ఒకరిని చూచేవాడుకాడు.

ప్రతిసాయంత్రం కొండలమీద పాతకోటచూడబొయ్యేవాడు. అక్కడుంటే వాళ్లవూరు జ్ఞాపకంవచ్చేదికాబోలు; మదనపల్లిఅంతా కొండలమయం అట, ఆయన ఒకప్పుడు చెప్పినట్లు నమ్మకం—మొదటనుండి ఆయన రాత్రిళ్లు ప్రొద్దుపోయి ఇంటికి వచ్చేవాడు. నగళ్లలో రెండోజాము కొట్టిందాక ఒక్కొక్కప్పుడు రాకపోతే నాకుచాలా కలవరంగా ఉండేది? అయితే క్రమేణా అలవాటైంది. ఆయన మిద్దెమీద కడపటిగదిలో ఉండినాడు.

ఒకనాటి సాయంత్రం బాగాచీకటిపడ్డ తర్వాత మాబట్టలపిల్లవాడు బట్టలను ఏటిలో కడుగుచుండగా, చాలాదూరమునుండి చేపలాగ యీదుచు వస్తుండే మన విశ్వేశ్వరయ్యను చూచినాడు; వాడువచ్చి నాతో చెప్పినాడు. రాత్రి పండుకో బొయ్యేటప్పుడు ఆయన దగ్గరకుపోయి 'స్వర్ణముఖిలో యీదుచున్నారట. జాగ్రత్త! పెద్దపెద్దసుడిగుండాలు పాచిబట్టినరాళ్లు విశేషంగా ఉన్నవి. అవలగట్టున ఉండేరెల్లు జాగ్రత్త అన్నాను. నా కీసంగతి తెలిసినందులకు చాలాచీకాకుపడినట్లు ముఖకళ మారిపోయింది.

'చివరకొకనాడు......అవును ఉదయమే .. విశ్వేశ్వరయ్య తనగదిలోలేడు...ఆరాత్రి సత్రానికి రానేలేదు. నేను ఆయనగదిలోకి వెళ్లి గాలించినాను; అల్మారాక్రింది అరలో ఒకజాబుపెట్టి ఉన్నది. దాని క్రింద నోట్లకట్టఉండినది—తర్వాత లెక్కచూచుకొంటే వెయిన్నీ ఏనూరు రూపాయ లుండినవి. అక్కడనే ఒక చిన్నదంతపుపెట్టె ఉండింది. దానిలో రెండుమూడువేల రూపాయలనగ లున్నవి. వాటినిచూచి నాకు మనస్సు అరుమూడయింది— ఏమీతోచక పరుగెత్తుకొనిపోయి పాలుపిండ బోవుచుండిన మాయింటాయనను పిలుచుకొని మరల ఆగదిలోనికి బోయినాను—అప్పుడాయన ఉండినాడు!' అంటూ నెట్టుకొనివచ్చే దుఃఖాని అపుకొని ప్రారంభించినది.

'నేను తిరిగి రాకపోతే యీడబ్బు నగలు మీరుతీసుకొని శాశ్వత దానధర్మాలు చేయండి' అనిఉన్నది. అప్పుడే మాయింటాయన వెతుకుటకు బయటకుబోయినాడు . . ఇప్పుడే కథకు విచిత్రమైనఘట్టం:— ఏటి ఇవతలి ఒడ్డున రాళ్లలో లక్ష్మీనిలయానికి యెదురుగా విశ్వేశ్వరయ్య గుడ్డలు కనబడినవి; ఆయనవాటిని తీసికొనివచ్చినాడు— ఆయన చాలా వేకువన పోవుటచేత ఆయనను ఎవరూచూడ లేదు. తరువాత గుడ్డలను కాల్చివేసినాము. మాయింటాయన విశ్వేశ్వరయ్య ఆపాచిలో యిరుక్కొనియో, సుడి గుండాలలో పడో మునిగిపోయి ఉంటాడనుకొన్నాడు. నేనుమాత్రం అదినమ్మలేదు. విశ్వేశ్వరయ్య మొదటవచ్చి నప్పుడు ఆయనచేతినుండిన పచ్చలఉంగరం తరువాతలేక పోవడం సుశీల చనిపోవునపుడు ముద్దుపెట్టుకొనిన ఉంగరం ఇదేమాదిరిదని వెంకటలక్ష్మి చెప్పడంచేతను సుశీల కథకు యీయనకు కొంతసంబంధం ఉండవలెనని నానమ్మకం......ఇంతే నాకేమి తెలియదు.'

'మంచిది , అయితే దీనినిగురించి వెంకటలక్ష్మిని అడుగలేదా?'

'అడుగలేదు. అయినా ఏంప్రయోజనం? ఆపిల్ల మొద్దు. దానికి ఈసంగతి తెలుసు; అయితే బయటకు రావడం ఎట్లా?'

కాసేపుదాకా రంగమ్మతలుపు ముందుకు వేసుకొని పోయినది. మనస్సు అయోమయసముద్రంలో గాఢాంధకారానిలాహతకల్లోలపరంపరలలో చిక్కి దరిగానకుండా ఉన్నది. లక్ష్మీనిలయం— పాడుబడ్డతోటలో, విరిగిన స్తంభములు కప్పుతో, నిర్జనంగా ఇంటిని మరుగుపరచే రెల్లుతో మర్మభేదకంగా ఎదుట నిల్చినది. ముగ్గురి ప్రాణములను తీసిన ఈనాటకం అంతు కనుగొనవలయునని సంకల్పించుకొన్నాను. కాళహస్తిలోకల్లా వెంకటలక్ష్మియే నాకు ముఖ్యమైనది.

ఆమెముఖం పూర్ణారోగ్యంతో ప్రకాశిస్తున్నా జాగ్రత్తగా పరిశీలింప హృదయాంతరాళమున రహస్యాలను అణచిపెట్టినచిహ్నాలు చిన్నమబ్బుచాటున మినుకు మినుకుమను నక్షత్రంవలె అప్పుడప్పుడు స్ఫురించుట గమనించినాను. తన అనుగుపట్టిని చంపి, ఆశిశువు తుది విలాపాన్ని వినావినే ఆమె ప్రవర్తనమువలెనే ఉన్నది వెంకటలక్ష్మిప్రవర్తనము. మరల అవ్యాజానురాగములను గురిసే ఆమెముఖబింబాన్ని, అమలినములైన చూపులను, నిర్దుష్టమైన చిరునవ్వును చూస్తే కథ అంతా మరచిపోయ్యేవాడిని......కాదు— లక్ష్మీనిలయవృత్తాంతం బయటకు దీయనిదే కాళహస్తి వదలకూడదనుకొన్నాను.

ఒకనాడు అన్నంవడ్డించేటప్పుడు నేను 'వెంకటలక్ష్మి' అన్నాను.

'అయ్యా!' అన్నది ఒకమాదిరి కలతచెందినట్లుండి.

'సరేగాని ఈసంగతిచెప్పు— సుశీల దగ్గరనుండి కూడా ఈసత్రంలో పనిచేస్తున్నావేమి? మరణసమయమున నీకేమియిచ్చి పోలేదా?'

'ఇవ్వకేమి?' అన్నది గౌరవసూచకంగా;

ఈమాటతో ఇంకా అడిగేదానికి నాకు సందు దొరికింది. కథలో ఆమేముఖ్యమైన పాత్రగాను, ఉచ్చులో ఇరుక్కొన్నట్లు కూడా తోచింది; ఆమె ఈఆఖ్యానానికి తుది ఆధ్యాయంఅని తోచింది; ఇదిమొదలు వెంకటలక్ష్మితో చాలాచనవుగా మాట్లాడుచుండేవాడిని. పోగాపోగా ఆమెయందు సద్గుణాలు మూర్తీభవించినట్లు కనుగొన్నాను. ఆమె చాలాశుభ్రంగా, అందంగా ఉంటుంది— ఇంతఎందుకు పురుషులను వశపరచుకొనే దానికి కావలసిన సామగ్రిఅంతా ఆమెదగ్గర ఉన్నది.

ఒకనాడు ఏదోపండుగ; అందుచేత సత్రానికి ఎవరు రాలేదు; వెంకటలక్ష్మికి పని తక్కువైంది. నేను మధ్యాహ్నం కూర్చొని 'పారిజాతాపహరణం' చదువుకొనుచున్నా. ఇంతలో వెంకటలక్ష్మి మిద్దెమీదకు వచ్చినది. 'వెంకటలక్ష్మి! ఇటురా!' అన్నాను.

వెంకటలక్ష్మి నవ్వుచూ వచ్చి 'ఏమండి' అంటూ తలుపుపట్టుకొని నిలబడ్డది.

'సుశీలదేవి సంగతి నీకు తెలిసినంతా దాచకుండా చెప్పు.'

'సీతారామయ్యగారు! అది నన్ను అడుగవద్దు' అని భయకంపితయై చెప్పింది; ముఖాన చీకట్లు కమ్ముకొన్నవి, స్వచ్ఛమైన ముఖకాంతి మాసినది. కండ్లు అకలుషితములైన కాంతిని పోగొట్టుకొన్నవి— కాసేపు అట్టే నిలబడ్డది......'మీరు కోరినట్లే మీకు చెప్పెదను. దయచేసి నా రహస్యాన్నిమాత్రం దాచాలె' అన్నది.

'నీకేమి భయంలేదు. నీ రహస్యం దొంగల మనస్సులోవలె భద్రంగా ఉంటుందిలే'

ఈమాటతోగూడ ఆమె తలుపుదగ్గర కూర్చున్నది—నిలుచొని, ఉపవాసాలు చేస్తూ ఎవరుకథలు చెప్పలేరులే. కథ ఆమూలాగ్రంగా చెప్పింది: అంతా చెప్పవలెనంటే యీదినంకాదు, కాబట్టి సంగ్రహిస్తాను.

"లక్ష్మీనిలయంలో సుశీలగది క్రింద నున్నది. ఆగదిలో నాలుగడుగుల చదరం గలిగిన చిన్నగది ఒకటి ఉన్నది. దానిలో సుశీల గుడ్డలు పెట్టివుంచేది. నేను చెప్పబోవువిషయం జరిగినరాత్రికి ముందు మూడునెలలప్పుడు ఆమెకు కొంచెం జబ్బుచేసింది. అందుచేత మధుసూదనుడు మిద్దెమీదకుపోయి పండుకొనేవాడు. ఈనాటిసాయంత్రం 'క్లబ్బు'నుండి ఊహింప నలవికాని కొన్ని విషయాలవల్ల ప్రతిదినం వచ్చేదానికంటే రెండు ఘంటలు ఆలస్యముగా వచ్చినాడు—ఏదోవిషయం మీద తెగని మీమాంస రావడంచేత గాబోలు. ఆనాడు చీట్లాటల్లో ఐదురూపాయలు గూడ ఓడినాడు—అప్పట్లో అది పెద్దమొత్తమే.

కొన్ని రోజులవరకు సుశీల నిద్రపోయినదో లేదో వెంకటలక్ష్మిని అడుగుచూ నిద్రపోయిందని ఎప్పుడూ చెప్పుచుండగా నమ్మకముచేతను, పరిచయముచేతను కలిగే సౌమ్యభావముతో మిద్దెమీద తనగదికి పోవుచుండేవాడు.

అయితే ఈరాత్రి ఆయనే సుశీలదగ్గరకుపోయి, ఆసంగతి స్వయంగా చెప్పవలయునని బుద్ధిపుట్టింది. మధుసూదనుడు ఆమధ్యాహ్నం సుశీల అసాధారణంగా అలంకరించుకొనుట కనిపెట్టినాడు. ఆసాయంత్రం 'క్లబ్బు'నుండి వచ్చేటప్పుడు తనభార్య స్వస్థతజెందినదనిన్ని వ్యాధి ఆమెకు ఇంకా కొంత సౌందర్యాన్నే కూర్చిందనిన్ని తనలో తాననుకొన్నాడు. సుశీల మధుసూదనుడు వచ్చి భోజనంచేసి గదికిపోయి పండుకొన్నాడనుకొన్నది. అప్పుడు వంటవాడు, గుర్రపువాడు వంటఇంట్లో పులిజూదం ఆడుచున్నారు; వెంకటలక్ష్మి చూస్తూకూర్చొని ఉన్నది. అందుచేత మధుసూదనుడు వెంకటలక్ష్మిని పిలువకుండా తానే దీపమునుపైన మెట్లల్లో పెట్టి దాని వెలుతురులో మిద్దెదిగి సుశీలగదిదగ్గరకు వెళ్లినాడు బోరునమంజే ఇంట్లో నడుస్తుంటే మూలలన్నీ మారుమ్రోగుచున్నవి. మధుసూదనుడాగదితలుపు తీసేసమయానికే గదిలో ఆచిన్నగది తలుపుగూడ శబ్దమైనట్లు గమనించినాడు. అయితే లోపలికిరాగానే సుశీల ఒక్కతే పుస్తకం చేతబట్టుకొని ఇటునటుతిరుగుచూ చదువుకొనుచున్నది. మధుసూదనుడు దాంట్లో ఉండేది వెంకటలక్ష్మి అనుకొన్నాడు. కాని అదేందో ఒకవిధమైన అనుమానం కర్ణరంధ్రాలలో ధ్వనించుచునే యుండినది. సుశీలతట్టు చూచినాడు. వీక్షణములు కలత జెందియున్నవి.

సుశీల 'ఈరాత్రి చాలా ఆలస్యమైనదే' అన్నది. స్వచ్ఛమును, మధురమును అయిన ఆమెకంఠధ్వనిలో చాలా మార్పు కన్పడ్డది. మధుసూదనుడు మాట్లాడలేదు; ఇంతలో వెంకటలక్ష్మికూడా వచ్చినది. ఆయనకు పిడుగుపడ్డట్లైంది.

మధుసూదనుడు వెనుక చేతులుపెట్టుకొని గదిలో ఇటునటు తిరుగుచున్నాడు. సుశీల మెల్లగా 'ఏదో ఒకమాదిరి ఉన్నారేమి?' అన్నది. వెంకటలక్ష్మి సుశీల తీసి అందిచ్చు నగలు అందుకొంటున్నది. వెంకటలక్ష్మితో 'నీవుపో నేనేపెట్టిలో పెడతా' అన్నది. మధుసూదనుడు ఇంకను మౌనముద్రను వీడలేదు. సుశీల భర్తవీక్షణాలలో కొంతపగ్గును గమనించి భర్తతో ఒంటరిగా నుండవలెనని వాంఛించినది. వెంకటలక్ష్మి కాసేపు గుమ్మంలో నిలువబడి వెనుకకు తిరిగి చూస్తూవెళ్లింది—అంత మధుసూదనుడు సుశీలదగ్గరకుపోయి కూర్చుండి మెల్లగా నిరుత్సాహంతో 'నీగుడ్డలగదిలో ఎవరో ఉన్నారు' అన్నాడు.

సుశీల భర్తవైపు సౌమ్యతతో జూచి 'లేరు, ఎవరూలేరు' అన్నది. ఈ 'లేరు' అన్నమాట మధుసూదనునికి హృదయభేదకమై నిశితనారాచమైనది. ఆయన దానిని నమ్మలేదు; కాని తనభార్య ఆసమయమునందున్నంతపవిత్రముగను, అంతనిష్కళంకముగను ఎప్పుడూ కాన్పించలేదు.. ...లేచి గదితలుపు తీయబోయినాడు. సుశీల తటాలున చేయిబట్టుకొని నిలిపింది. దుఃఖభాజనమైన చూపులతోచూచి స్నిగ్ధరాగచోదితమయిన వాక్కులో 'జ్ఞాపకముంచుకొండి,— అక్కడ

ఎవరులేనట్లయితే ఇంతటితో మనయిద్దరి భాగ్య సర్వమును ముగియును' అన్నది. ఈమాటలతోగూడ ఒకవిధమైన గాంభీర్యము, గురుత్వమును సుశీల సర్వాంగముల నాశ్లేష మొనర్చినవి. అంత మధుసూదనుడు 'లేదు. నేనుపోను ......ఎటులైనను మనవియోగము తప్పనిది — నీహృదయ నైర్మల్యమును నేనెరుగుదును. నీవుజీవితయాత్రను పవిత్రముగ గడుపుచున్నావని నాకు తెలియనిది కాదు. మృత్యువును దప్పించుకొనుటకు నైచ్యమున కొడిగట్టవని నేనెరుగుదును ......కాని మనయిద్దరిమధ్య అనుమాన మనే మహార్ణవము ప్రభంజనప్రేరితమై భూనభోంతరసంకాశమైన అలలతో ఘూర్ణిల్లుచున్నది' అన్నాడు. ఈమాటలు వినగానే సుశీలనేత్రములనుండి క్రూరమైనకాంతి వెల్వడినది. మధుసూదనుడు మరల కొంతసేపటికి 'ఉండు ...ఇదిగో రామాయణము— దైవసాక్షిగా అక్కడ ఎవరు లేరని ప్రమాణము చేయుము. నిన్ను నమ్మెద... ఎప్పటికీ ఆతలుపు తీయను అన్నాడు. సుశీల 'దైవసాక్షిగా .... '

'బిగ్గరగా'

'దైవసాక్షిగా ఆగదిలో ఎవరును లేరు' నిశ్చలంగా ప్రమాణం చేసినది.

రెండు నిముషముల తరువాత మధుసూదనుడు నవ్వుచూ 'సుశీలా, ఆపచ్చలఉంగరం ఎక్కడిది. చాలా బాగున్నదే. ఇంతవరకు నేను గమనించలేదు' అన్నాడు సుశీల వ్రేలుబట్టుకొని చూస్తూ 'మన సుబ్బాబత్తుడి దగ్గరకొన్నా. ఆయన మచనపల్లినుండి వచ్చినవాళ్ల ఎవరి దగ్గరనో కొన్నాడట' అని జబాబు చెప్పింది —

'చాలా బాగున్నది' అంటూ వెంకటలక్ష్మిని పిలిచినాడు. ఆలస్యములేకయే వెంకటలక్ష్మి ఎదుట నిలబడ్డది ...వెనుక తోటప్రక్క ఉండే కిటికీదగ్గరకు పిలిచి మెల్లగా 'నీవు వెంకడిని పెండ్లి చేసుకొనవలయునని ఉండే సంగతి నాకు తెలుసును. అయితే పాపం నీదారిద్ర్యమే మీనడుమ నిలిచింది —సరే, పోయి వాడిని తక్షణమే తీసికొనిరా, తాపీమట్టంతో రమ్మని చెప్పు; ఇంట్లో ఎవరికీ తెలియకుండా నిద్రలేపుకొని రావలె. తెలిసిందా? నీమనసు...తర్వాత, నీఅదృష్టం పండుతుంది. గొణుక్కోకుండా పో, లేకపోతే — అంటూ ముఖం చిట్లించుకొన్నాడు. వెంకటలక్ష్మి మాట్లాడకుండా పోయింది.

మధుసూదనుడు నడవలోకి వచ్చి 'పెంచలూ.'అని బొబ్బరించినాడు; పులిజూదం చాలించి వచ్చినాడు. పెంచలుగాడు గుడ్డివాడైనను, మధుసూదనునికి మంచి అంతరంగికుడు.

'పోయి అందరూ నిద్రపొండి' అన్నాడు పెంచలును దగ్గరకు రమ్మని చేతితో సంజ్ఞ చేస్తూ. తరువాత మెల్లగా 'వాళ్లంతా నిద్రపోయిన తర్వాత నాతోవచ్చి చెప్పు' అన్నాడు. మధుసూదనుడు సుశీలను ఒకకంటితో కనిపెట్టుతూనే మాట్లాడినాడు. లోపలికి వచ్చి కూర్చొని 'క్లబ్బు' సంగతులు చాలా కులాసాగా చెప్పుచున్నాడు; ఇంతలో వెంకటలక్ష్మి వచ్చింది. వీరి యిష్టాగోష్ఠిని జూచి దానికేమి అర్థమైంది కాదు.

'అయ్యా! వెంకడు వచ్చినాడు' అన్నది నిమ్మళంగా.

'లోపలికి రమ్మను' అన్నాడు బిగ్గరగా.

బేలుదారీవాడు లోపలికిరాగానే సుశీల కొంత విషణ్ణ అయినది. మధుసూదనుడు 'వెంకా! పోయి గుడ్డిపులాయింపగ్గర ఉండే ఇటికెరాళ్లు సున్నం దీసికొనిరాండి; ఆచిన్నగదివాకిలికి గోడకట్టవలె' అని వెంకడిని వెంకటలక్ష్మిని కడగా పిలిచి యిట్లా మెల్లగా అన్నాడు:— 'వెంకా, విను...ఈరాత్రికి నీవు యిక్కడనే పండుకొనవలె. అయితే రేపు తెలువనే నేను చెప్పిన ఒక పట్నంపోవలె...నీకు రెండువేలరూపాయలిస్తా. అక్కడ నీవు పదిసంవత్సరములుండవలె; ఆచోటు నీకు అనుకూలపడకపోతే వేరొకపట్నంపోవచ్చును—అది దగ్గరకాకుంటే సరి. పొయ్యేటప్పుడు నీవు చెన్నపట్నంపోయి నేను వచ్చిందాక అక్కడనే ఉండవలె; అక్కడ మరల మూడువేలరూపాయలు వీలువ్రాస్తా; నేను చెప్పినట్లు నెరవేర్చి తిరిగివస్తే ఆపైకం నీకు చెందుతుంది: ఈధనానికి యీరాత్రి మనంచేయబొయ్యేపని తపసించినా బయటకు రానీయకూడదు........ఇంక, 'వెంకటలక్ష్మి! నీసంగతి: మీ పెండ్లివాడు వెంకడినే పెండ్లాడితే, ఐదువేలరూపాయలు యిచ్చేటట్లు వీలువ్రాస్తా; అయితే నీవు యీవిషయమై మూగై ఉండవలె— లేకపోయెనా ఈధనం నీకు చెందదు!.

వెంకడు గోడకట్టడం ప్రారంభించినాడు. సుశీల 'వెంకటలక్ష్మి, యిటువచ్చి నాజడవెయ్యి' అన్నది. మధుసూదనుడు వేలుదారిని, గదితలుపును, సుశీలను గమనిస్తూ పరధ్యానంలో ఉండినట్లు గదిలో ఒక మూల నుండి మరియొకమూలకు నడుస్తున్నాడు. ఎంతకష్టపడ్డా కొంచెంగా తాపీశబ్దం వినబడక తప్పిందిగాదు. మధుసూదనుడు దూరంగాపోయివున్నాడు. పనివాడు రాళ్లను తెచ్చి క్రిందబోయుటలో శబ్దమైనది, ఆసమయంలో సుశీల ఎవరికీ వినబడకుండా 'వెంకటలక్ష్మి, వెంకడితో గోడలో రెండురంధ్రాలు పెట్టమని చెప్పితే నీకు సంవత్సరానికి ఏనూరురూపాయలిస్తా' అన్నది. తరువాత బిగ్గరగా 'పోయి రాళ్లు అందీ, పో' అన్నది.

మధుసూదనుడు, సుశీల నిశ్శబ్దంగా ఉన్నారు. వెంకడు గోడను భుజాలవరకు కట్టినాడు సుశీలను పలుకరిస్తే అన్యాపదేశంగా ఏమైనా చెపుతుందేమోయని మధుసూదనుడు పలుకలేదు. సుశీల గంభీరభంగమనియో, వివేకమనియో మాట్లాడలేదు. మధుసూదనుడు అటు తిరిగియుండునపుడు వెంకడు తాపితో తలుపుకు వేసియుండిన అద్దాన్ని కొట్టినాడు; అప్పుడు వాళ్లు ముగ్గురుఒకమనిషి--దుఃఖానలదగ్ధుడగు ఒకమనిషి—ముఖమును చూచినారు; అతని కండ్లుమాత్రము ప్రజ్వలిస్తున్నవి. మధుసూదనుడు వెనుకకు మరలక ముందే సుశీల లోపలనున్న మనిషికి తలతో ఏదో సంజ్ఞ చేసింది. ఈసంజ్ఞతో పనవాలేదన్నది కాబోలు.

వేకువన చుక్కపొడిచేవేళకు గోడ పూర్తిఅయినది. వెంకడు అక్కడనే పండుకొన్నాడు. పెంచలుగాడు వాడిని కనిపెట్టుకొని ఉండినాడు. మధుసూదనుడు సుశీలగదిలోనే నిద్రపోయినాడు; ఉదయాన నిద్రలేస్తూ 'దివానుతో పోయి మాట్లాడవలె' అని కండ్లు పులుముకొంటూ అన్నాడు. లేచి పైన ఉత్తరీయంవేసికొని వెనుకకు చూస్తూ బయటకు పోయినాడు.

సుశీల ఆనందోద్రేకమువలన వణకినది. సుబ్బాబత్తుడు దగ్గరకో, దివాంజీ దగ్గరకో పోవుచున్నాడనుకొన్నది. మధుసూదనుడు తోటసుమ్మం దాటక ముందే వెంకటలక్ష్మిని పిలిచింది. 'వెంకటలక్ష్మి! కట్టెతీసికొనిరా, గోడను త్రవ్వి మరలాకట్టుదాము. రాత్రి వెంకడు కట్టడం చూచినాం కదా.' అన్నది భయవిహ్వలయై.

రెండు ముహూర్తములలో వెంకటలక్ష్మి రెండు కట్టెలు తీసికొనివచ్చినది. మహాప్రయత్నముతో ఇద్దరు పచ్చిగోడను పడగొట్ట నారంభించినారు; సుశీల కొన్ని రాళ్లను తీసినది. అధికోత్సాహంతో ప్రపంచం మరచి త్రవ్వుచున్నది... వెనుకదిరిగి చూచుసరికి మధుసూదనుడు వెనుక నిలువబడియున్నాడు. సుశీల మూర్ఛాహతయై క్రింద పడిపోయినది; మధుసూదనుడు సుశీలను 'మంచం మీదకు పట్టండి' అన్నాడు. మధుసూదనుడు తాను లేనప్పుడు ఇది జరుగునని శంకించియే ఇట్టి చిత్రమైన ఉరులు పన్నినాడు.—నిజంగా దివాంజీతో నిన్ననే మాట్లాడినాడు; సుబ్బాబత్తుడు కోసం మనిషిని ఇంతకు ముందే పంపినాడు......గదిలోని అలజడి స్తిమితపడిన కొద్దికాలమునకే సుబ్బాబత్తుడు వచ్చినాడు.

రాగానే మధుసూదనుడు చాలా ఆతురతతో 'నీవు మదనపల్లివారిదగ్గరనుండి కొన్ని ఉంగరములు కొన్నావా? అని అడిగినాడు.

'లేదయ్య' అన్నాడు బత్తుడు. ముఖం అయోమయలక్షణాలను కనబరచినది.

మధుసూదనుడు క్షుద్బాధా పీడితమైన వ్యాఘ్రము అవస్థలంజెంది చివరకు ఎరయైన హరిణమును జూచినట్లు చూచినాడు సుశీలను. సుశీల అదేమాదిరి వీక్షణాలను జబాబుపంపినది.

'పెంచలూ! నాకు అన్నం ఇచటకే తీసికొనిరా, సుశీలకు జబ్బుగానున్నది ఆరోగ్యమును బొందినదాక నేనిచటనే యుండెదను' అన్నాడు.

పాషాణహృదయుడు మధుసూదనుడు ఇరువదినాల్గుదినములు ఆగదిలో సుశీలవగ్గరనే ఉండినాడు. మొదటిరోజులలో ఆగదినుండి ఏదైన స్వల్పధ్వనివినవచ్చిన సుశీల చచ్చుచున్నవానియందు దయాంతరంగికు డవుకమ్మని ప్రార్థించుచుండేది. దానికిబదులు మధుసూదనుడు 'దానిలో ఎవరూలేరని రామాయణము నెత్తినబెట్టుకొని ప్రమాణంచేస్తివికదా' అని వారించేవాడు. సుశీల పలికేదిగాదు."

* * * * * *

కథ ముగియగానే స్తంభీభూతులమైన మేము నెమ్మదిగా తెప్పరిల్లినాము; ఇండ్లకు వచ్చుటకు బయలుదేరినాము; కథలో చివరవాక్యం జ్ఞాపకమునకు వచ్చినప్పుడెల్ల మాలో కొందరికి చాలాకాలము వరకు ఒకవిధమైన శైత్యం అలగకద్భులను ఆవరించేది.